క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లిలో ఆంజనేయస్వామి రథోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీఎత్తున తరలివచ్చి రథోత్సవం వీక్షించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనంతలక్ష్మి, ఎంపీటీసీ నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ విజయేంద్ర, అగ్రిబోర్డు కమిటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు రామప్ప, మాజీ అధ్యక్షులు గురువయ్య, ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ నల్లక్కి తిప్పేరుద్ర, నాయకులు తిమ్మారెడ్డి, నల్లక్కి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సపోజ్ క్రిస్మస్ వేడుకలు



వాక్యాన్ని బోధిస్తున్న చల్లా కిషోర్

కంబదూరు: మండలంలోని ములకనూరు గ్రామంలోని బెరాక ప్రార్థన మందిరంలో సోమవారం సపోజ్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాలూకా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు చల్లాకిషోర్ కేక్ కట్ చేసి క్రీస్తు జననం గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రభుదాసు, సంఘపెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

దళితుల భూములను కాపాడండి



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత

కళ్యాణదుర్గం: దళితుల భూములను కాపాడాలని దళిత సంక్షేమ సంఘం నాయకులు ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మితను కోరారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అంకె తిప్పేస్వామి, దొణతిమ్మప్ప కోరారు. బొమ్మనహాల్ మండలం హరేసముద్రంలో దళితులు వెంకటరమణ, శివరాజ్ సాగు చేస్తున్న ఆరు ఎకరాలను అదే గ్రామానికి చెందిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారించి బాధితులకు న్యాయం చేయాలని వారు కోరారు. అనంతరం పలు సమస్యలపై వచ్చిన అర్జీలను ఆర్డీఓ స్వీకరించారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన



కంబదూరు: అవగాహన కల్పిస్తున్న రిడ్స్ ప్రతినిధులు

రాయదుర్గం/టౌన్/బొమ్మనహాళ్/కంబదూరు: రాయదుర్గం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి మాస్‌ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు సహకారం అందించారు. , ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరావ్, లెక్చరర్ ప్రభాకర్, మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బొమ్మనహాళ్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీడ్స్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కంబదూరు మండలం తిమ్మాపురంలోని గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌వ్యాధిపై రిడ్స్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అవగాహన కల్పించారు. రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

‘గడప గడపకూ’ చరిత్రాత్మకం

- 1,02,569 ఇళ్లను సందర్శించిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- నేడు మురడిలో ముగింపు కార్యక్రమం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చరిత్రాత్మకమని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సందర్శించి ప్రజల కష్టసుఖాలను తెలుసున్నానని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన ఈ బృహత్తర కార్యక్రమం రాయదుర్గం నియోజకవర్గంలో 2022, మే 11న బొమ్మనహాళ్ మండలం బొల్లనగుడ్డంలో ప్రారంభించానన్నారు. 18 నెలల తర్వాత డి హీరేహాళ్ మండలం మురడిలో మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సోమవారం మురడిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' నిర్వహించిన అనంతరం విప్ విలేకరులతో మాట్లాడారు.. రాయదుర్గం అర్బన్‌తో పాటు డి.హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లోని 96 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో 1,02,569 గడపలను సందర్శించడం సంతోషానిచ్చిందన్నారు. ప్రజలతో దగ్గరగా మమేకమయ్యే ఈ కార్యక్రమం నా రాజకీయ జీవితంలో గుర్తుండిపోతుందన్నారు. గడప గడపలోనూ ప్రజలు చూపిన ఆదర అభిమానాలు మరచిపోలేనన్నారు.

సమస్యల పరిష్కారానికి పెద్దపీట

పట్టణం/ గ్రామాల్లో సుమారు 540 రోజుల పాటు ప్రజల మధ్యనే ఉంటూ వారు చెప్పిన సమస్యల పరిష్కారానికే పెద్దపీట వేస్తూ వచ్చామని విప్ కాపు తెలిపారు. టీడీపీ హయాంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిన పల్లెల్లో ప్రగతి మెరిసేలా .. అభివృద్ధి మురిసేలా కృషిచేశామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రజా సంక్షేమానికి రూ.20 లక్షలు ఖర్చుచేశామన్నారు. తద్వారా రూ.20 కోట్లు కేవలం సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మార్గం చూపామన్నారు. ఈ నిధులతో మరిన్ని పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల లబ్ధి

డి హీరేహాళ్ మండలం మురడిలో కురుబ నాగవేణి, కురుబ మహదేవ కుటుంబ సభ్యులకు గడిచిన నాలుగేళ్లలో అమ్మఒడి, సున్నావడ్డీ, క్రాప్ ఇన్సురెన్స్, రైతు భరోసా పథకాల ద్వారా రూ.7,44,053 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. ఇలా ప్రతి గడప లోనూ గరిష్టంగా రూ.2 నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి చేకూర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. నవరత్న పథకాలు నవశకానికి నాంది పలికాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక్క ఏపీలో మాత్రమే డీబీటీ ద్వారా రూ.1.35 లక్షల కోట్లను నేరుగా అక్క, చెల్లెమ్మల ఖతాలకు చేర్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కిందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం విజయవంతం ద్వారా ప్రజల్లో పార్టీకి మైలేజ్ పెరిగిందన్నారు. టీడీపీ దొంగలు, వారికి వంతు పాడే ఎల్లో మీడియా అడుగడుగునా ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూసినా ప్రజలే ముందుకు ముందుకు తీసుకెళ్లారని, వారందరికీ రుణపడి ఉంటామన్నారు. మాజీ మంత్రి కాలవ కనుసన్నాల్లో కొందరు టీడీపీ నాయకులు తిన్నింటి వాసాలు లెక్కకట్టేలా వ్యవహరించారని దుయ్యబట్టారు. వారు అందుకున్న సంక్షేమాన్ని లెక్కలతో సహా వివరించేందుకు వెళితే కొందరు తలుపులు వేసుకుని వెళ్లిపోవడం, మరికొందరు లోపల ఉండి తలుపులు తెరవకపోవడం, ఇంకొందరు అన్నీ ఇచ్చినా అడ్డంగా వాదిస్తూ తగవులకు దిగడం లాంటి ఘటనలు కొన్ని చోట్ల ఉత్పన్నమయ్యాయన్నారు. తీరా చూస్తే కాలవ శ్రీనివాసులు చెప్పడంతోనే అలా మాట్లాడాల్సి వచ్చిందని కొందరు చెప్పారన్నారు.

భారీ విజయం తథ్యం

వచ్చే 2024 ఎన్నికల్లో రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం అడ్డుకోవడం ఎవరి తరం కాదని, ప్రజలంతా మరో 30 ఏళ్ల పాటు ఈ రాష్ట్రానికి సీఎంగా జగన్‌ను మాత్రమే కోరుకుంటున్నారన్నారు. 50 వేల మెజారిటీకి తగ్గకుండా విజయం సాధిస్తామన్నారు. అనంతరం మురడిలో చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వానికి అపూర్వ ఆదరణ, ప్రజల్లో స్పందన లభించింది. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, సర్పంచ్ గంగప్ప, మాజీ సర్పంచ్ పద్మనాభరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, పట్టణ కౌన్సిలర్లు ఐనాపురం మంజు, పారాళ్ల గోవిందరాజులు, కొంతెం దేవరాజు, డిష్ గోవిందు, పకృద్దీన్, కో–ఆప్షన్ కడ్డిపుడి నజీర్, సర్పంచులు బోయ మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, ఎంపీటీసీ కల్యం సురేష్, స్థానిక నాయకులు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలంలోని మురడిలో మంగళవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

నేడు మంత్రి పర్యటన

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో మంగళవారం పలు కార్యక్రమాలలో రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పాల్గొననున్నారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదలైంది. ఉదయం 9 గంటలకు కళ్యాణదుర్గం పట్టణ సమీపంలోని కేవీకే వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంత్రి ప్రారంభించనున్నారు. అలాగే 9.30 గంటలకు మంత్రి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనాలు



ఉసిరి చెట్టు కింద భోజనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

కూడేరు: మండలంలోని కరుట్లపల్లి వద్ద ఉన్న ఎంపీపీ పొలంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ నారాయణరెడ్డి, లీలావతి దంపతులు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అశ్వని, అగ్రి అడ్వైజరీ మండల కమిటీ చైర్‌పర్సన్ నిర్మలమ్మ, అధికారులు పాల్గొన్నారు.

అప్పుడే ప్రలోభ పర్వం

- కళ్యాణదుర్గంలో చీరల పంపిణీకి తెరలేపిన ఉన్నం ఫ్యామిలీ



వడ్డేపాలెంలో చీరలు పంపిణీ చేస్తున్న ఉన్నం వరలక్ష్మి

కళ్యాణదుర్గం: అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా షెడ్యూల్ కూడా రాలేదు. అభ్యర్థులు సైతం ఖరారు కాలేదు. అయినప్పటికీ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు ప్రలోభాలకు తెరలేపారు. చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈసారి అసెంబ్లీ టికెట్ తమకే వస్తుందంటూ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుటుంబం చెప్పుకుంటోంది. ఈ క్రమంలోనే సోమవారం ఉన్నం హనుమంతరాయ చౌదరి కోడలు వరలక్ష్మి నియోజకవర్గంలోని కుందుర్పి మండలం వడ్డేపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. చీరలు పంపిణీ చేస్తూ ఎన్నికల్లో తమకే ఓటు వేయాలని కోరడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఉన్నం కుటుంబ వ్యవహార శైలిపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడు వర్గం మండిపడుతోంది. టికెట్‌పై అధిష్టానం ఎలాంటి సంకేతాలూ ఇవ్వకముందే తన ఇమేజీని డ్యామేజీ చేయడానికి ఉన్నం ఫ్యామిలీ ఈ ఎత్తుగడ వేసిందని ఉమా మహేశ్వర నాయుడు భావిస్తున్నారు. దీంతో ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు సన్నద్ధం అవుతున్నట్లు సమాచారం.

రేషన్ పంపిణీ పక్కాగా చేపట్టాలి

బ్రహ్మసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే రేషన్ బియ్యం(డోర్ డెలివరీ) పంపిణీ పథకాన్ని పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ వాణిశ్రీ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సివిల్ సప్‌లై డీటీతో పాటు మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్డుదారులకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీ చేయాలన్నారు. డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వివాహిత మృతి

కళ్యాణదుర్గం: నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత నందేశ్వరి(24) చికిత్స పొందుతూ మృతి చెందింది. కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆమె అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ క్రమంలో గురువారం వైద్య చికిత్స కోసం కళ్యాణదుర్గం వెళ్లి అక్కడే నిప్పంటించుకుంది. స్థానికులు గమనించి అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ విజయవంతం చేయండి

బెళుగుప్ప: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంపీడీఓ రామచంద్ర సూచించారు. సోమవారం మండలంలోని అంకంపల్లి సచివాలయాలన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీఓ గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు, ఆడుదాం ఆంధ్ర, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ యాప్ లాగిన్లపై దిశానిర్దేశం చేశారు. సచివాలయ సేవలను మరింత విస్తృతం చేయాలని పంచాయతీ కార్యదర్శి గోపాల్, సిబ్బందికి సూచించారు.

జాగ్రత్తలు పాటించాలి

వజ్రకరూరు: సీజనల్ వ్యాదులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, రాత్రిపూట దోమతెరలు వాడాలని వైద్యాధికారులు సూచించారు. మండల కేంద్రంలో సోమవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలోడిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, వైద్యాధికారి సర్దార్‌వలి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు సుశీల, శంకర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఇంటి ముంగిటకే వైద్య సేవలు



కూడేరు: సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండ: మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కూడేరు: ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా పేదవాడికి ఇంటి వద్దనే మెరుగుగైన వైద్య సేవలు అందించిన ఘనత ముఖ్య మంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని పి.నారాయణపురంలో సోమవారం వారు సచివాలయ, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. అలాగే నాలుగున్నరేళ్లలో సచివాలయ పరిధిలో సంక్షేమం పేరిట అందించిన లబ్ధి, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను తెలిపే బోర్డును ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ముంగిటకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌కు ప్రతిఒక్కరూ అండగా నిలిచి మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని వారు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంత రెడ్డి, ఎంపీపీ నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తుప్పటి అశ్వని, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, అగ్రి అడ్వైజరీ మండల కమిటీ అధ్యక్షురాలు నిర్మలమ్మ, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, సొసైటీ ప్రెసిడెంట్ గంగాధర్, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా, ఏఓ విజయకుమార్, డాక్టర్ సౌమ్య రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నేతలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా కృషి చేయాలి

ఉరవకొండ: రానున్న ఎన్నికల్లో ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా కృషి చేయాలని మంత్రి ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బళ్లారి బైపాస్‌లో ఉన్న కురుబ బసవప్ప ఇంట్లో కట్లే గౌరమ్మ ఉత్సవంలో పాల్గొన్న అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డిను అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు కానుకగా ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ గోవిందు, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, వ్యాసాపురం ఉలిగప్ప, పార్టీ మండల సమన్వయకర్త ఓబన్న, పచ్చిరవి, బ్యాళ్ల ప్రసాద్, గాదిలింగ తదితరులు పాల్గొన్నారు.

సంకల్పయాత్ర విజయవంతం చేయండి

గుమ్మఘట్ట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 12 నుంచి 19వ తేదీ వరకూ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రచారం చేయాలన్నారు. వైద్యుడు బాలాజీనాయక్, ఆర్ఐ చంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ, వైకేపీ ఏపీఎం కళానాయక్, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవుల జాతర

కుందుర్పి: మండలంలోని వడ్డెపాళ్యం, శ్రీమజ్జనపల్లిలో సోమవారం సాయంత్రం ఆవుల జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులు ఆవులు, ఎద్దులను వివిధ రూపాల్లో అలంకరించి గ్రామోత్సవంగా తీసుకెళ్లి గ్రామ శివార్లో ఏర్పాటు చేసిన ఈడు(అగ్నిగుండం)చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.ఇలా చేయడం వల్ల మూగజీవాలకు ఎలాంటి రోగాలు సోకవని రైతుల నమ్మకం. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ గోవిందమ్మ, ఎంపీటీసీ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గజగౌరీదేవి ఉత్సవాలు



బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో..



వజ్రకరూరు మండలం పీసీ కొత్తకోటలో..



కణేకల్లు మండలం బెణికల్లులో..

బొమ్మనహాళ్: మండలంలో గజగౌరీ దేవి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఉంతకల్లు, ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, కృష్ణాపురం, శ్రీధరఘట్ట, నేమకల్లు, దేవగిరి తదితర గ్రామాల్లో గజగౌరీదేవి విగ్రహాలను శివాలయాల్లో ప్రతిష్ఠించారు. మంగళవారం గజగౌరీ దేవికి చక్కెర హారతులు ఇస్తారు.

పీసీ కొత్తకోటలో కట్లేగౌరమ్మ ఉత్సవాలు

వజ్రకరూరు: పీసీ.కొత్తకోటలో సోమవారం కట్లే గౌర మ్మ ఉత్సవాలు ప్రారంభించారు. మంగళవారం అమ్మవారికి హారతుల సమర్పణ, బుధవారం అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పోలీసు బందోబస్తు నడుమ వేడుకలు

కణేకల్లు: మండలంలోని బెణికల్లు గ్రామంలో పోలీసు బందోబస్తు నడుమ గజగౌరి వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల విషయమై ఎస్సీ, నాన్ ఎస్సీల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా పోలీసులు పహారా కాస్తున్నారు. సోమవారం ఉదయం గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా గజగౌరి అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరి కింద కొలువుదీర్చారు. రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, కణేకల్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి, బొమ్మనహాళ్ ఎస్ఐ శివతోపాటు పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి గజగౌరీదేవి పూల రథోత్సవం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో మంగళవారం నుంచి ఈనెల 29 వరకూ గజగౌరీదేవి పూల రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని పోలేపల్లిలో మంగళవారం గౌరమ్మ దేవి జాతర నిర్వహించనున్నారు. బుధవారం అర్ధరాత్రి 1 గంటకు గౌరీదేవి ఆగమనం, గురువారం భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు.

వైభవంగా కార్తీక దీపారాధన



వజ్రకరూరు మండలం కొనకొండ్ల ఛాయామల్లే శ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి



రాయదుర్గం: దీపారాధన చేస్తున్న మహిళలు



కళ్యాణదుర్గం రూరల్: శివాలయం ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

రాయదుర్గం: కార్తీక పౌర్ణమి, గౌరీ వ్రతం సందర్భంగా సోమవారం శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. పట్టణంలోని బళ్లారి రోడ్డులో ప్రసిద్ధి చెందిన నీలకంఠేశ్వరుడు, భక్త మార్కండేయ, జంబుకేశ్వర, హాటకేశ్వర ఆలయాలతో పాటు నియోజకవవర్గంలోని కణేకల్లు, బొమ్మనహాళ్, డి హీరేహాళ్, గుమ్మఘట్ట, రాయదుర్గం మండలాల్లోనూ శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. గవిసిద్దేశ్వర ఆలయం లో వెలసిన 116 శివలింగాలకు ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. డి హీరేహాళ్ మండలం మురడి, బొమ్మనహాళ్ మండలం నేమకల్లులో ప్రసిద్ధి చెందిన ఆంజన్న ఆలయాల్లోనూ కార్తీక సందడి కనిపించింది. మురడి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పూజలు నిర్వహించారు. రాయదుర్గం నీలకంఠేశ్వరుడి ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప దీపారాధన చేపట్టారు.

కళ్యాణదుర్గం/రూరల్: కార్తీక మాస పూజల్లో ఆర్డీఓ డాక్టర్ రాణి సుస్మిత పాల్గొన్నారు. పట్టణంలోని కోట వీధిలో వెలసిన భవానీ శంకరాలయంలో సోమవారం ఆర్డీఓ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాలూకా బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓకు శేష వస్త్రాలు అందజేసి సత్కరించారు. అలాగే పట్టణంతో మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బ్రహ్మసముద్రం: కార్తిక పౌర్ణమి సందర్భంగా సోమవారం మండంలోని బ్రహ్మసముద్రం, భైరసముద్రం , కన్నేపల్లి, కుర్లగుండ , సూగేపల్లి, ఎరడికెర , గుండిగానీపల్లి తదితర గ్రామాల్లో వెలసిన శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక దీపాలను వెలిగించారు.

కుందుర్పి: కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం మండల వ్యాప్తంగా శివాలయాల్లో భక్తులు విశేష పూజలు చేపట్టారు. కుందుర్పి కట్టకింద మల్లేశ్వరస్వామి ఆలయం, తూముకుంట హరిహరేశ్వరస్వామి ఆలయం, మలయనూరు శివాలయం, రుద్రంపల్లి ఈశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి.

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన దేవాలయమైన శ్మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్పంచ్ పద్మావతమ్మ, తిమ్మప్ప దంపతులు, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, కవిత దంపతులు ఊరేగింపుగా వెళ్లి స్వామికి దూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయంలో దీపాలను వెలగించారు.అలాగే ములకనూరు శివాలయంలో ఎంపీపీ తిమ్మరాజమ్మ, గోవిందప్ప దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వజ్రకరూరు: మండలంలోని శివాలయాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొనకొండ్ల ఛాయామల్లేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి పూజలు చేపట్టారు.

కూడేరు: మండలంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రంలో జోడు లింగాలకు భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ధ్వజ స్తంభం ఎదుట మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.